సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం


లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు


రామభద్రపురం: ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తలగాంలో బుధవారం పర్యటించారు. వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ సంకిలి రాధమ్మల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పైబడి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు వివరించారు. అర్హత ఉండి పథకాలు ఎవరికైనా అందకపోతే వెంటనే తెలియజేయాలన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం ఉంటుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన తెచ్చారని, అన్ని ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాటలు వేస్తుందని వెల్లడించారు. నిరుద్యోగ యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తున్నారని వెల్లడించారు. మరో 8 నెలల్లో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేసే బాధ్యత మనందరిపై ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ సంకిలి రాధమ్మ, పార్టీ నాయకులు కిమిడి సన్యాసినాయుడు, సాదెం శ్రీరాంమూర్తి, పోలిరెడ్డి రమేష్, గేదెల రామకృష్ణ, కర్రి గోవిందరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి..

రామభద్రపురం: పేదల సంక్షేమమే లక్ష్యంగా మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరలా ఆదరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. మండలంలోని కొండకెంగువ పంచాయతీ పరిధిలో గల జుమ్మువలస, జీలుగువలస గిరిజన గ్రామాలలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు హారతులతో నాయకులకు స్వాగతం పలికారు. అనంతరం ఎమెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీయడంతో పాటు సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి, వైఎస్సార్ రైతుభరోసా, తదితర పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూరిందా, లేదా అని ఆరా తీశారు. అనంతరం జుమ్ము వలస గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. పాఠశాలలోని మౌలిక వసతులపై ఆరా తీయగా.. భవనం కారిపోతోందని విద్యార్థులు తెలియజేశారు.

దీంతో ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో పర్యటించగా.. జగనన్న పాలనలో తామంతా ఆనందంగా ఉన్నామని గ్రామస్తులు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలందిస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, నాయకులు బెవర ప్రసాద్, కత్తుల బుచ్చయ్య, తదిరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు


కొత్తగా మంజూరైన వారికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. కొండకెంగువలో కొత్తగా మంజూరైన పెన్షన్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులం, మతం, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని తెలిపారు. గతంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. అలాగే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెన్షన్ కోసం పంచాయతీ కార్యాలయాలు, రామమందిరాల వద్ద రోజంతా పడిగాపులు కాసేవారన్నారు. కాని ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులందరికీ ఒకటో తేదీనే పింఛన్లు మంజూరవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, సచివాలయ కన్వీనర్ బెవర ప్రసాద్, ఎంపీడీఓ రమామణి, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న తెర్లాం ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులంతా విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం ఉండాలనే లక్ష్యంతో జేఏఎస్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులంతా ఈ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య సిబ్బంది, సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం పాఠశాలకు వచ్చేటప్పుడు విద్యార్థులకు ఉన్న అనారోగ్య సమస్యలను వారి దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈనెల 15 నుంచి గ్రామ వలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. తర్వాత సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు ప్రతి పాఠశాలకూ వచ్చి విద్యార్థుల అనారోగ్య సమస్యలపై తెలుసుకుంటారన్నారు. ఈనెల 30 నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు పాపారావు, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ


లక్ష్మీపురంలో ఫించన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్


నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ కృష్ణారావు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, ఆమదాలవలస, చిన్నశిర్లాం బూరాడ తదితర గ్రామాల్లో కొత్తగా మంజూరైన వైఎస్సార్ ఫించన్లను బుధవారం పంపిణీ చేశారు. గ్రామ సచివాలయాలు వద్ద వీటిని లబ్ధిదారులకు ఆయా పంచాయతీల సర్పంచ్‌ల చేతుల మీదుగా అందించారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలతో సంబంధం లేకుండా లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సర్పంచ్‌లు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ

బొబ్బిలి: మున్సిపాలిటీలోని గొల్లపల్లి 11వ వార్డులో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు బుధవారం పంపిణీ చేశారు. అలాగే 16వ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎస్. రామకృష్ణ (బాబు) పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని పిరిడి, దిబ్బగుడ్డివలస గ్రామాల్లో కూడా పింఛన్లు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత


వైఎస్సార్ బీమా సాయాన్ని అందిస్తున్న సర్పంచ్ రాంబాబు

రేగిడి: మండలంలోని పెద్దశిర్లాం గ్రామానికి చెందిన కురిటి రేణుకకు వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని సర్పంచ్ లెంక రాంబాబు బుధవారం అందించారు. రెండు రోజుల క్రితం ఈమె భర్త కురిటి ప్రభాకరరావు పాము కాటుకు గురై మృతి చెందారు. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద ఈమెకు రూ.10 వేలు తక్షణ సాయం అందించగా, మిగిలిన సాయాన్ని ఆమె బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేయనున్నట్లు సర్పంచ్ వెల్లడించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సుధీర్, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, యువకులు

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని కంచరాం ఎంపీయూపీ స్కూల్ హెచ్‌ఎం రామగోవిందం అన్నారు. బుధవారం గ్రామానికి చెందిన యువత సమకూర్చిన మొక్కలను పాఠశాల ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడంతోనే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువకులు బత్తిన సురేష్ పాల్గొన్నారు.

లోపాలుంటే సహించేది లేదు..


భోజనాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తదితరులు


తెర్లాం: జగనన్న గోరుముద్ద పథకం మెనూలో ఎటువంటి లోపాలున్నా సహించేది లేదని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ స్పష్టం చేశారు. మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటలను రుచి చూశారు. అలాగే మెనూ సక్రమంగా అమలు చేస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం


కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: పార్టీలకతీతంగా అర్హులందరికీ పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక రెండో గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఎవరైనా మరణిస్తే ఆ స్థానంలో కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారని, కాని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్నవారందరికీ ఆరు నెలలకోసారి పెన్షన్లు మంజూరు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తెర్లాం-1,2 సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు హరి, పుష్ప, మహిళా పోలీస్ తులసి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రారంభమైన స్కూల్ గేమ్స్


కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

సంతకవిటి: మండల పరిధిలోని మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుండి విద్యార్థుల ఈ పోటీలలో పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు నియోజక వర్గ స్థాయిలో జరిగే ఆటల పోటీలలో పాల్గొంటారని పీడీ సన్నిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వి.శ్రీనివాసనాయుడు, వావిలపల్లి రామకృష్ణం నాయుడు, ప్రధానోపాధ్యాయులు రవిశంకర్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన


జిల్లేడు ద్రావణంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి : మండలంలోని అంబఖండి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు కరణం వరలక్ష్మి, పుర్లి లక్షున్నాయుడు రైతులకు జిల్లేడు ద్రావణం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. వరి పంటకు తెగుళ్లు సోకినప్పుడు పురుగు మందులు పిచికారీ చేయకుండా జిల్లేడు ద్రావణాన్ని పిచికారీ చేస్తే తెగుళ్ల నివారించవచ్చునని అన్నారు. జిల్లేడు ద్రావణం తయారీకి 10 కిలోల జిల్లేడు ఆకులు తీసుకుని ముద్దగా చేయాలని సూచించారు. పది లీటర్ల ఆవు మూత్రం , వంద లీటర్ల నీరు ఒక డ్రమ్‌లో పోసి, వాటిలో జిల్లేడు ముద్దను వేయాలని తెలిపారు. పూర్తిగా ఈ ద్రావణాన్ని మరగబెట్టాలని, వచ్చిన ద్రావణాన్ని తగిన మోతాదులో వరి పంటకు పిచికారీ చేస్తే పురుగు నివారణకు ఉపయోగపడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరావు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు : ఎమ్మెల్యే


తలగాంలో పెన్షన్లు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు వెల్లడించారు. మండల పరిధి తలగాంలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పెన్షన్లను లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో కొత్త పెన్షన్ రావాలంటే ఒకరు మరణించాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అర్హత కలిగిన ఎంత మంది ఉన్నా ప్రతీ పథకం మంజూరు చేపడుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. లబ్ధిదారులు మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా నేరుగా గ్రామంలో ఉన్న సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తు ఇస్తే సకాలంలో పథకాలు మంజూరవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, కర్రి గోవిందరావు, ఎంపీడీఓ శోభిభూషణరావు, పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అజెండాలో ఆస్పత్రి బెడ్‌ల వివరాలు పొందుపరచండి..


ఆస్పత్రి అభివృద్ధి సంఘ సమావేశంలో పాల్గొన్న శంబంగి, తదితరులు

బొబ్బిలి: గత సమావేశాల్లో ఆస్పత్రిలో అదనంగా బెడ్‌లు సమకూర్చాలని అనుకున్నాం కదా..! ఆ వివరాలు అజెండాలో పొందుపరచలేదేం? అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించారు. బుధవారం స్థానిక సీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అజెండా కాపీని పరిశీలించి పది బెడ్‌లు అయినా కొనుగోలు చేసేటట్టు అజెండాలో పొందుపరచాలని ఆదేశించారు. దీంతో ఏడో అంశంగా పది బెడ్‌ల కొనుగోలుకు అజెండాలో పొందుపరిచి ఆమోదించారు. అలాగే డిప్యూటీ సివిల్ సర్జన్, చిన్న పిల్లల వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని, ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్ కోసం కంప్యూటర్ల కొనుగోలు, అంతర్గత డ్రైనేజీ, ఎలక్ట్రికల్ రిపేర్ల కోసం సమావేశంలో చర్చించి ఆమోదించారు. సమావేశంలో వైద్యాధికారి జి. శశిభూషణరావు, డాక్టర్ కె. రాజారమేష్, సభ్యులు సుబ్బారావు, టీబీ రాణి, బి. అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవస్థలను మేనేజ్ చేసే వ్యక్తి చంద్రబాబు..

- రైతు సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి



బొబ్బిలి: వ్యవస్థలను మేనేజ్ చేసి ఆడుకునే పెద్ద క్రిమినల్ చంద్రబాబు నాయుడని రైతు సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, స్కిల్ డవలప్‌మెంట్ పేరు మీద సీమెన్స్ కంపెనీ పేరుపెట్టి దోచుకున్న అవినీతి బయటపడిన విషయం తెల్సిందేనని, అయితే ఆ కంపెనీకి కూడా ఈ విషయం తెలియకుండా రూ.370 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన ఘనుడ్ని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు ఏనాడూ విలువలతో కూడిన రాజకీయం చేయలేదన్నారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టి ఆ డబ్బునే ఎన్నికల్లో ఖర్చుపెట్టి రాజకీయాల్ని భ్రష్టుపట్టించాడన్నారు. రాజకీయాన్ని వ్యాపారం చేసిన చంద్రబాబు వల్ల సామాన్యులు రాజకీయాల్లోకి రాలేకపోయారన్నారు. ప్రజాధనాన్ని లూటీ చూసిన చంద్రబాబును కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆకర్షణీయంగా గణనాథుల విగ్రహాలు


రాజాం మెయిన్‌వీధిలో విక్రయానికి గణనాథుని ప్రతిమలు


కలశం ఆకారంతో బొజ్జ గణపతి


రాజాం మార్కెట్‌లో గ్రీనరీ గణనాథుడు

వినాయకచవితి ఉత్సవాలకు గణనాథుల ప్రతిమలు సిద్ధమయ్యాయి. రాజాం, బూరాడ, కంచరాం తదితర ప్రాంతాల్లో నిండైన రూపాలతో గణనాథుని ప్రతిమలు కనువిందు చేస్తున్నాయి. వినూత్న ఆకారాలతో, విభిన్న రంగులతో గణనాథ విగ్రహాలు జోరుగా అమ్ముడవుతున్నాయి.

– రాజాం

ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

బాడంగి: మండలంలో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 26 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. తనతో పాటు తహసీల్దార్ రఫీజాన్ ఆధ్వర్యంలో రెండు బృందాలు గ్రామాల్లో పర్యటించి శిబిరాలు నిర్వహిస్తాయన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిబిరాలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. 30న బాడంగి -2 సచివాలయం పరిధిలో, అక్టోబర్ 3న బొత్సవానివలస, 4న కోటిపల్లి, 5న కోడూరు-2, 6న గూడెపువలస, 7న భీమవరం , 9న గజరాయునివలస, 10న వీరసాగరం, 11న ఆనవరం, 12న రేజేరు, 13న తెంటువలస, 16న పాల్తేరు, 17న డొంకినవలస, 18న కోడూరు-1, 19న గొల్లాది, 20న వాడాడ, 21న ముగడ, 26న బాడంగి-1 హైస్కూల్‌లో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ కాంతులు


వన్నలిలో విద్యుత్ కాంతులు

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో జగనన్న కాలనీలో బుధవారం విద్యుత్ కాంతులు కనువిందు చేశాయి. ఈ కాలనీలో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుంటున్నారు. వీరికి విద్యుత్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, వీధి దీపాలు, స్తంభాలు ఏర్పాటు చేశామని ఎలక్ట్రికల్ సబ్ ఇంజినీర్ హరి, జేఎల్‌ఎమ్ కొరికాన వెంకటేష్‌లు వెల్లడించారు. సర్పంచ్ గార రమణ చేతుల మీదుగా వీధి దీపాలు కనెక్షన్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

బొబ్బిలి: చిన్న వయసు నుంచే పర్యావరణ సమతుల్యతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని వక్తలు అన్నారు. మండలంలోని అలజంగి పంచాయతీ వెలగవలసలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోధరరావు, వనమిత్ర అధ్యక్షుడు కె. కృష్ణదాసు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

రాజాం: పట్టణంలో చీపురుపల్లి రోడ్డులో నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీకృష్ణుని ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి, ఇందూ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో బాగంగా త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో రాజాం ప్రబోధ సేవా సమితి సభ్యులతో పాటు బొద్దాం కమిటీ అధ్యక్షులు ముల్లు రామినాయుడు, కుప్పిలి గణపతిరావు, బట్న మోహనరావు, పట్నాన అప్పలనరసయ్య, కంచరాం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

తెర్లాం: మండలంలోని సతివాడ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులు, జగనన్న గోరుముద్ద పథకం, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ, మెరుగైన విద్యా బోధన చేయాలని సూచించారు.

సంక్షిప్తంగా...

ఎంపీడీఓ రామకృష్ణకు సన్మానం

తెర్లాం: మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు అహర్నిషలు కష్టపడి పని చేయడంతో పాటు జిల్లా ఉత్తమ ఎంపీడీఓగా పలుమార్లు అవార్డులు అందుకున్న శంబంగి రామకృష్ణను మండలంలోని రంగప్పవలస గ్రామస్తులు బుధవారం సన్మానించారు. సర్పంచ్ శనపతి రాంబాబు, ఉప సర్పంచ్ దేవుపల్లి శివరాం, మాజీ సర్పంచ్ బాడంగి వెంకటస్వామితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులంతా కలిసి ఎంపీడీఓను దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మండలాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఎంపీడీఓను కోరారు.


క్రీడలతో మానసిక ఉల్లాసం

వంగర: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. వంగరలో మండల స్థాయి క్రీడల పోటీలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. అండర్ – 14, అండర్ – 17 కేటగిరిలో వివిధ రకాల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీలు ఎస్.రాంబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు వైఎస్సార్ పెన్షన్ ఓ వరం

సంతకవిటి: అవ్వాతాతలకు వైఎస్సార్ పెన్షన్ కానుక వరంలాంటిదని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని హొంజరాంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన 12 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సిరిపురపు మంజు, సర్పంచ్ సిరిపురపు కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి మోహన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శశిభూషణరావు



వంగర: ఎంపీడీఓగా హనుమంతు శశిభూషణరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం ఈఓపీఆర్‌డీగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసిన వావిలపల్లి శ్రీనివాసరావు యధావిధిగా రాజాం మండల పరిషత్ ఈఓపీఆర్‌డీగా విధుల్లో చేరారు.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి

బాడంగి: మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలడంతో స్థానిక సీహెచ్‌సీ రోగులతో కిటకిటలాడుతోంది. జ్వరాలు, డయేరియా లక్షణాలతో రోగులు వస్తుండడంతో సీహెచ్‌సీలో పడకలు చాలడం లేదు. ఓపీ రోగులు సైతం డాక్టర్లను కలవడానికి గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం రోగులందరికీ మెరుగైన వైద్యసేవలందిస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు.

పక్కాగా ప్రీ స్కూల్స్..

బాడంగి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూళ్లను పక్కాగా నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీ శాంతకుమారి అన్నారు. బుధవారం స్థానిక స్వామి కల్యాణ మంటపంలో ప్రాజెక్ట్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన చేయాలన్నారు. అదేవిధంగా పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం కార్యకర్తలకు ఎత్తు, బరువు తూచే పనిముట్లును అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజ్యలక్ష్మి, బాడంగి, తెర్లాం, రామభద్రాపురం మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో ప్రభుత్వ యూపీ పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ నెల 14న హిందీ దివాస్ సందర్భంగా ఈ పోటీలు హిందీ భాషలో నిర్వహించినట్లు ప్రచారక్ కె.మధుసూదనరావు తెలిపారు. 62 మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు. విజేతలకు హిందీ దివాస్ రోజున బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ.మహేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

రాజాం: పట్టణంలో భవిత కేంద్రాన్ని ఎంఈఓ యాగాటి దుర్గారావు బుధవారం పరిశీలించారు. కేంద్రంలో చదువుతున్న విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. టీఎల్‌ఎంపై ఆరా తీశారు. మొత్తం 22 మంది విద్యార్థులు చదువుతున్నట్టు ఎంఈఓ తెలిపారు. కేంద్రం ఉపాధ్యాయులు హరిబాబు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పుష్కలంగా సాగునీరు

సంతకవిటి: మండలంలో రెండు రోజుల నుండి వర్షాలు కురవడంతో నారాయణపురం ఆనకట్టలో నీటి ఉధృతి పెరగడంతో కుడి కాలువ గుండా సాగునీరు పుష్కలంగా ప్రవహిస్తుంది. దీనితో కుడి కాలువ ఆయకట్టు శివారు గ్రామాలకు కూడా సాగునీరు అందడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.